

చంచల్‌గూడలోని సెంట్రల్ జైలులోని రేడియో క్యాబిన్ నుంచి మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి అబ్దుల్ జావేద్ భాషా

ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు

● డీఎల్ఎస్ఏ కార్యదర్శి అబ్దుల్ జావేద్ భాషా

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఉచిత న్యాయ సేవలు పొందడం ఖైదీల హక్కు అని డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి అబ్దుల్ జావేద్ భాషా అన్నారు. సోమవారం ఆయన చంచల్‌గూడ జైలును సందర్శించి జైలులో ఉన్న ఎఫ్ఎం రేడియో క్యాబిన్ నుంచి మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేని ఖైదీల తరఫున వాదించడానికి న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. పరివర్తన చెంది సమాజంలో మంచి పౌరులుగా గుర్తింపు పొందాలని ఖైదీలకు ఆయన సూచించారు. విడుదలైన తర్వాత జీవనోపాధికి ఇబ్బంది లేకుండా ఖైదీలకు వృత్తి నైపుణ్యాల పట్ల మెరుగైన శిక్షణ ఇవ్వాలని జైలు అధికారులకు సూచించారు. అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సేవల గురించి ఖైదీలకు వివరించాలన్నారు. వారి సమస్యలను ఎప్పటికప్పుడు డీఎల్ఎస్ఏ దృష్టికి తీసుకురావాలని జైలు సిబ్బందికి ఆయన సూచించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ నవాబ్ శివకుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



యూజీడీ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

యూజీడీ నిర్మాణ పనులకు శంకుస్థాపన

చంపాపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని శ్రీరమణకాలనీ ఫేజ్-1లో యూజీడీ నిర్మాణ పనులకు కార్పొరేటర్ సుజాతానాయక్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మెట్రో వాటర్‌వర్క్స్ నిధులు రూ.10.50లక్షలతో యూజీడీ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కాలనీలోని రోడ్డు నెం.3లో కొంతకాలంగా ప్రజలు డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. కాలనీలో త్వరలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయనున్నట్లు, సీసీ రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించనున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

కాలనీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటా

కొత్తపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కాలనీ సమస్యలు గుర్తించండి పరిష్కార చర్యలు తీసుకుంటానని కార్పొరేటర్ పవన్‌కుమార్ న్యూ మారుతీనగర్‌కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గానికి సూచించారు. కాలనీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు నీరంకి రవి, ఉపాధ్యక్షులు రవికేశవ్, మహేష్‌దాయమా, మురళీకృష్ణ, కార్యదర్శి తాళ్లపల్లి ప్రభాకర్, కోశాధికారి శ్రీనివాస్‌కృష్ణ, నిర్వాహక కార్యదర్శులు ఆంజనేయులు, ఎం.శంకర్, ఆనంద్, సంయుక్త కార్యదర్శులు అరుణ్‌కుమార్, డీ.సంతోష్‌కుమార్, పద్మ పాల్గొన్నారు. నాగేశ్వర్‌నగర్‌కాలనీలోని దాసాంజనేయస్వామి ఆలయ అష్టమ వార్షికోత్సవ మహోత్సవాల సందర్భంగా కార్పొరేటర్ ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఇమ్మడి నారాయణ, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



అమూల్ డెయిరీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న తారామతిపేట గ్రామస్థులు

అమూల్ డెయిరీ ఎదుట తారామతిపేటవాసుల నిరసన

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పసుమాములలోని అమూల్ డెయిరీ ఎదుట తారామతిపేట గ్రామస్థులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. డెయిరీ నుంచి వస్తున్న కెమికల్స్‌తో దుర్వాసన వస్తుందని దీంతో గ్రామస్థులు వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలా ద్వారా కెమికల్స్ నేరుగా తారామతిపేట గ్రామం వరకు వస్తుందని తెలిపారు. పలుమార్లు డెయిరీ నిర్వాహకులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. కెమికల్స్ నీటిని ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా మూసీలోకి మళ్లించాలని సూచించారు. స్పందించిన డెయిరీ నిర్వాహకులు పది రోజుల్లో చర్యలు చేపడుతామని హామీ ఇచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు.



కుంకుమార్చన పూజల్లో పాల్గొన్న మహిళలు

ప్రత్యంగిరాదేవి ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మన్సూరాబాద్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఆర్కేపురం డివిజన్ పరిధిలోని కుర్తాల పీఠం ప్రత్యంగిరాదేవి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కుర్తాల ఆస్థాన పండితులు బ్రహ్మశ్రీ మాచవోలు రమేష్ శర్మ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి 19వ తేదీ బుధవారం వరకు నిర్వహించనున్నారు. కాగా ఈ ఉత్సవాలలో భాగంగా మొదటి రోజైన సోమవారం అమ్మవారికి 18రకాల ద్రవ్యాలతో విశేషాభిషేకం, హోమాలు, సామూహిక కుంకుమార్చన, లలితా, విష్ణుసహస్రనామ పారాయణాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మునిపల్లె సువర్ణలత, విఠల్ శర్మ, శ్రీపతి, అన్నపూర్ణ, హేమ, దేవి, హిమబిందు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సంతోష్‌నగర్ : టీఎస్ఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని 11కేవీ డెంటల్‌కాలేజ్, హుడాకాంప్లెక్స్, కమలనగర్, నర్సింహపురికాలనీ, నేతాజీనగర్, పుష్పగార్డెన్, సరూర్‌నగర్, శారదనగర్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో విభజన, నిర్వహణపనుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని డీఈ తెలిపారు. 11కేవీ డెంటల్‌కాలేజీ, హుడాకాంప్లెక్స్, కమలానగర్, నర్సింహపురికాలనీ, నేతాజీనగర్, పుష్పగార్డెన్, సరూర్‌నగర్, శారదనగర్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.



జిల్లెలగూడ చందచెరువు కట్టపై మొక్కనాటి నీరుపోస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి



సరూర్‌నగర్ చౌడి వద్ద వృద్ధాశ్రమంలో పెద్దలకు పండ్లు పంపిణీ చేస్తున్న మహేశ్వరం బీఆర్ఎస్ యూత్ వింగ్ మాజీ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి



మాజీ సీఎం కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వంజరి ప్రవీణ్‌కుమార్

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

జోన్‌బృందం : మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ శ్రేణులు సోమవారం జోన్ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో ఘనంగా జరుపుకున్నాయి. మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ చందచెరువు కట్ట వద్ద బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వృక్షోత్సవంలో మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి పాల్గొని మొక్కలు నాటి నీరుపోశారు. మన్సూరాబాద్ డివిజన్ అలకాపురికాలనీలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బీఆర్ఎస్ నాయకులు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పండ్లు పంపిణీ చేశారు. వనస్థలిపురం వైదేహినగర్ నార్త్ పార్కులో మొక్కలు నాటారు. మిఠాయిలు పంపిణీ చేసి సంబురాలు నిర్వహించారు. హయత్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి ఆధ్వర్యంలో వృద్ధుల చేత కేక్ కట్ చేయించారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. చంపాపేట డివిజన్‌లోని కర్మన్‌ఘాట్‌లో ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ నేతలు కేక్ కట్ చేశారు. అనంతరం కర్మన్‌ఘాట్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వారు పండ్లు పంపిణీ చేశారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన కేసీఆర్ జన్మదిన వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలనీలను పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

● బీజేపీ రాష్ట్ర నేత శ్రీరాములుయాదవ్ ధ్వజం

సరూర్‌నగర్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): గతంలో పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పాలకులుగానీ, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పాలకులుగానీ బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని కాలనీలు, బస్తీల అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ ధ్వజమెత్తారు. 23వ డివిజన్‌లోని శివసాయినగర్ కాలనీలో ఆయన పర్యటించి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, పాలకుల నిర్లక్ష్యం కారణంగా తమ కాలనీలో చేపట్టిన వరదనీటి కాలువ నిర్మాణం పనులు మధ్యలోనే ఆగిపోయాయని ఈ సందర్భంగా స్థానికులు ఆయనకు వివరించారు. అనంతరం అందెల మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం తమ పార్టీ నిరంతరం ముందుండి పోరాడుతుందని, ఇక్కడి సమస్యలను పరిష్కరించేలా అధికారులపై ఒత్తిడి తీసుకువస్తామని పేర్కొన్నారు.



శివసాయినగర్‌లో పర్యటిస్తున్న శ్రీరాములుయాదవ్

కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు నడికుడ యాదగిరి, మాజీ కార్పొరేటర్ గౌర రమాదేవిశ్రీనివాస్, బీజేపీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, గుర్రం మల్లారెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, సందీప్ పాల్గొన్నారు.

మురుగునీటి పైపులైన్‌ను మా కాలనీలకు దూరంగా తీసుకువెళ్లాలి

హయత్‌నగర్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మురునీటి పైపులైనును మా కాలనీల నుంచి మరింత దూరం తీసుకువెళ్లాలని కమ్మగూడలోని లక్ష్మీనగర్, ఇందిరమ్మకాలనీ, సుందరయ్యనగర్‌కాలనీల ప్రజలు తుర్కయంజాల్ మున్సిపల్ అధికారులకు విన్నవించుకున్నారు. సోమవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్‌ను కలవడానికి ఆయా కాలనీల ప్రజలు వచ్చారు. దీంతో కమిషనర్ లేకపోవడంతో అక్కడే ఉన్న డీఈఈకి తమ వినతిపత్రాన్ని అందజేశారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కమ్మగూడలో ప్రగతినగర్, రాజ్‌రంజిత్‌నగర్‌కాలనీ, టీచర్స్‌కాలనీ, సాయినగర్‌కాలనీ, వెంకటేశ్వరకాలనీ ఆ పైన ఉన్న కాలనీల మురుగునీటి కోసం అధికారులు భూగర్భ డ్రైనేజీ పైపులైనును నిర్మించారు. మురుగునీటి పైపు లైనును కమ్మగూడలో ఫారెస్టు భూమిలో వదిలివేయడంతోనే సమస్య వచ్చి పడింది. ఫారెస్టు భూమిని ఆనుకునే పేద ప్రజలు నివసించే లక్ష్మీనగర్, ఇంజాపూర్ ఇందిరమ్మకాలనీ, ఆపిల్ ఎవెన్యూకాలనీ, సుందరయ్యనగర్‌లు ఉంటాయి. స్థానికంగా ఉన్న గుంతల్లో మురుగునీరు చేరి చెరువులను తలపిస్తుంది. దీంతో భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయి, రాత్రి అయిందంటే భరించలేని దుర్గంధవాసన వస్తుంది, వాసనకు భోజనం చేయలేకపోతున్నామని, పిల్లలు, వృద్ధులు అనారోగ్యం పాలవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



డీఈఈ భిక్షపతికి వినతిపత్రం ఇస్తున్న బాధిత కాలనీ ప్రజలు

నేడు 'వేద నాదం-శాంతి వాదం'

మన్సూరాబాద్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మతాల మధ్య విద్వేశాలను, హింసాకాండలను ఖండిస్తూ శాంతి, సర్వహితాన్ని కాంక్షించడమే తమ ధ్యేయమని హిందూస్ ఫర్ ప్లూరాలిటీ అండ్ ఇక్వాలిటీ అధ్యక్షుడు సాధు త్రినాథదాస్, అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామిలు సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఎల్బీనగర్‌లోని జైభారత్ కార్యాలయంలో మంగళవారం శ్రీరామకృష్ణ పరమహంస జయంతిని పురస్కరించుకుని 'వేద నాదం-శాంతి వాదం' పేరిట వేద సూక్తుల పఠనం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్నమయ్య కళాక్షేత్రం, హిందూస్ ఫర్ ప్లూరాలిటీ అండ్ ఇక్వాలిటీ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో శాంతి, సర్వహితాన్ని కాంక్షించే ప్రతి ఒక్కరూ విచ్చేసి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

రాంగ్‌రూట్‌లో వాహనాల రాకపోకలపై చర్యలు తీసుకోండి

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ నుంచి పెద్దఅంబర్‌పేట్ వరకు జాతీయ రహదారికి రెండు వైపుల ఉన్న సర్వీసు రోడ్డులో రాంగ్ రూట్‌లో వాహనాల రాకపోకల ప్రమాదాల నివారణపై ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని పెద్దఅంబపేట్‌కు చెందిన గంట ప్రభాకర్‌రెడ్డి కోరారు. ముఖ్యంగా సర్వీసు రోడ్డులో రాంగ్‌రూట్‌లో వాహనాల రాకపోకలు ఎక్కువ అయ్యాయని తెలిపారు. దీంతో పెద్దఅంబర్‌పేట్, లక్ష్మారెడ్డిపాలెం వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇటీవలే రెండు మూడు ప్రమాదాలు జరిగాయని ఓ ప్రమాదంలో వ్యక్తి మృతిచెందగా.. మరో ప్రమాదంలో పలువురు గాయాలపాలయ్యారని చెప్పారు. ఈ విషయంలో ట్రాఫిక్ పోలీసులు తగు చర్యలు తీసుకుని ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడి మృతి

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలోని న్యూ మార్కెట్ మెట్రోస్టేషన్ ఫుట్‌పాత్‌పై అపస్మారక స్థితిలో పడి ఉన్న వృద్ధుడిని చాదర్‌ఘాట్ పోలీసులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. చాదర్‌ఘాట్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత శనివారం రాత్రి ఏడున్నర గంటల ప్రాంతంలో మలక్‌పేటలోని న్యూమార్కెట్ మెట్రోస్టేషన్ వద్ద నున్న ఫుట్‌పాత్‌పై వృద్ధుడు అపస్మారక స్థితిలో పడిఉన్నట్లు చాదర్‌ఘాట్ పోలీసులు గుర్తించారు. అనంతరం 108లో చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతి చెందినట్లు వైద్యులు తెలపడంతో అతని వివరాలు ఆరాతీయగా తెలియరాలేదు. మృతుడు 55 నుంచి 60ఏళ్ల వయస్సు కలిగి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తికి సంబంధించిన కుటుంబీకులు, బంధువులు గుర్తించిన వెంటనే చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌లో స్వయంగా సంప్రదించాలని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ తెలిపారు.

'నుమాయిష్' ఆదాయంతో విద్యావ్యాప్తి

● ప్రభుత్వం తరఫున సహకరిస్తాం
● ముగింపు ఉత్సవాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్



జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి పొన్నం

అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): యేటా అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన నుమాయిష్ ద్వారా వస్తున్న ఆదాయాన్ని వెనకబడిన తెలంగాణ ప్రాంతాల్లో విద్యాసంస్థలు నెలకొల్పి, విద్యావ్యాప్తికి కృషి చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఎగ్జిబిషన్ సొసైటీ చేస్తున్న కృషిని కొనియాడారు. సోమవారం రాత్రి నాంపల్లిలోని ఎగ్జిబిషన్ మైదానంలో గాంధీ సెంటనేరీ హాల్ వేదికగా 84వ అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శన-2025 నుమాయిష్ ముగింపు ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 46 రోజుల పాటు నిరవధికంగా నుమాయిష్ ఎలాంటి ఇబ్బందులు, అవరోధాలు లేకుండా ప్రశాంతంగా ముగిసిందన్నారు. అందుకు కృషి చేసిన సొసైటీ వర్గాలను ప్రత్యేకంగా అభినందించారు. యేటా నిర్వహణ ద్వారా వచ్చే ఆదాయాన్ని సామాజిక సేవా కార్యక్రమం కింద విద్యాసంస్థలు స్థాపించి విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నారన్నారు. ఇక ప్రభుత్వపరంగా కూడా సహకరిస్తామని భరోసా ఇచ్చారు. దేశ, విదేశాల్లో మున్ముందు మరింత ఆదరణ పొందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈసారి దేశ, విదేశాల నుంచి లక్షల మంది సందర్శకులు వచ్చారన్నారు. అనంతరం ఉత్తమ స్టాళ్ల యజమానులు, అధికారులు, ఇతరులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్‌కుమార్ యాదవ్, రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ శివసేనారెడ్డి, తెలంగాణ మైనారిటీస్ గురుకులాల విద్యాసంస్థల సొసైటీ చైర్మన్ ఫయిమ్ ఖురేషి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు నిరంజన్, సురేందర్ రెడ్డి, డి. మోహన్, ప్రభాశంకర్, రవీయాదవ్ పలువురు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

● కూల్‌డ్రింక్‌లో విషం కలిపి సేవించిన మహిళ
● ఆస్పత్రికి తరలించిన పోలీసులు

హయత్‌నగర్ : భర్తకు అక్రమ సంబంధం ఉందని అనుమానంతో మానసిక క్షోభకు గురైన గృహిణి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బీ.ఎన్.రెడ్డినగర్ వినాయక హిల్స్‌కు చెందిన చేత్రం శ్వేత(19) రెండేళ్ల క్రితం మహేష్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరికి 11నెలల కుమారుడు కూడా ఉన్నాడు. భర్తకు అక్రమ సంబంధం ఉందని తెలిసిన శ్వేత మానసిక క్షోభకు గురై సోమవారం సాయంత్రం హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుంట్లూరులోని నిర్మానుష్య ప్రదేశానికి చేరుకుంది. ఆత్మహత్య ప్రయత్నంలో భాగంగా వెంట తెచ్చుకున్న లైజాల్, డొమెక్స్, ఎలుకల మందును కూల్‌డ్రింక్‌లో కలుపుకొని సేవించింది. ఇది గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే 100కు ఫోన్‌చేసి, సమాచారమందించారు. హయత్‌నగర్‌కు చెందిన పెట్రోలింగ్ వాహనం అక్కడికి చేరుకొని వెంటనే అపస్మారక స్థితిలో ఉన్న శ్వేతను చికిత్స కోసం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. శ్వేత ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపినట్లు పోలీసులు వివరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్బీనగర్‌లో పాత నేరస్థుడి అరెస్టు

కొత్తపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ డిటెక్టివ్ పోలీసులు పాత నేరస్థుడిని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామినేని చౌరస్తా సమీపంలో భరత్ నగర్‌లో ఉండే గంప అర్జున్(20) చెడు అలవాట్లకు బానిసై సులభంగా డబ్బు సంపాదించాలని తాళం పగులగొట్టి ఇళ్లల్లో విలువైన వస్తువులు చోరీ చేస్తున్నాడు. గతంలో అతడు బాలుడిగా ఉన్నప్పుడే చైతన్యపురి, ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ఇళ్లల్లో దొంగతనాలు చేశాడు. జువెనైల్ హోమ్ నుంచి విడుదలైన తర్వాత మార్పు ఆశించిన అతడిని తల్లిదండ్రులు మోత్కూర్‌లో ఉండే అతడి తాతయ్య వద్దకు పంపించారు. ఇటీవలే అతడు భరత్‌నగర్‌కు వచ్చాడు. మారాడని అనుకుంటే మళ్లీ నేరానికి పాల్పడ్డాడు. ఈనెల 16న అర్ధరాత్రి దాటిన తర్వాత 2:30 గంటలకు తాడు సాయంతో అతడు అదే కాలనీలోని ఓ భవనం రెండవ అంతస్తుకు చేరుకుని తెరచి ఉంచిన కిటికీ లోంచి కొత్త రామ్‌చరణ్‌గౌడ్ ఇంట్లోకి చొరబడ్డాడు. బ్యాగుల్లో వెతుకుతుంటే, అలికిడి విన్న రామ్‌చరణ్‌గౌడ్ అతడిని పట్టుకున్నాడు. పోలీసులకు అప్పగించడానికి కింది ఫ్లోర్‌కు తీసుకువస్తున్న క్రమంలో అర్జున్ అతడిని తోసేసి పరారయ్యాడు. రామ్‌చరణ్‌గౌడ్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు సోమవారం ఎన్టీఆర్‌నగర్ చింతచెట్ల బస్‌స్టాప్ వద్ద అతడిని అదుపులోకి తీసుకొని విచారించారు. నేరం అంగీకరించడంతో అతడిని రిమాండుకు తరలించారు.

మహనీయుల కలలను సాకారాం చేయాలి

● ఎమ్మెల్యే సబితారెడ్డి

సరూర్‌నగర్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మహనీయులు కలలుగన్న సమ సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేసినప్పుడే వారి కలలు సాకారం అవుతాయని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని 39వ డివిజన్ కమలానగర్ కాలనీలో మాజీ కార్పొరేటర్ మాదరి సురేఖరమేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్, పూలే, బీజేఆర్ విగ్రహాలను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలు దళిత, బీసీ సంఘాల ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చిల్డ్రన్స్ ట్రాఫిక్‌పార్కులో హెల్మెట్ పెట్టుకుని సైకిళ్లు తొక్కుతున్న చిన్నారులు

విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

కొత్తపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నామని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ రాచపూడి తెలిపారు. సోమవారం వనస్థలిపురం భాష్యం హైస్కూల్ నుంచి 70మంది చిన్నారులు రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. రహదారి భద్రత అవగాహనలో భాగంగా వారికి లెక్చర్ హాల్‌లో వీడియోలు, రైమ్స్ ప్రదర్శిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల విద్యార్థులకు అర్థమయ్యేలా ట్రాఫిక్ నిబంధనల చిత్రాలను పార్కులో లోపలి గోడలపై ఏర్పాటు చేశారన్నారు. అనంతరం చిన్నారులు పార్కులో హెల్మెట్లు పెట్టుకుని సైకిళ్లపై తిరుగుతూ, బ్యాటరీ కారు నడుపుతూ సందడి చేశారు.

రాజ్యాంగం పుస్తకం బహూకరణ



షబ్బీర్‌అలీకి రాజ్యాంగం పుస్తకం బహూకరిస్తున్న మహ్మద్ షకీల్ తదితరులు

ఓల్డ్‌మలక్‌పేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నాయకుడు షబ్బీర్‌అలీ జన్మదినంను పురస్కరించుకొని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహ్మద్ షకీల్ ఆధ్వర్యంలో ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఆయన నివాసంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజ్యాంగం పుస్తకాన్ని షబ్బీర్‌అలీకి బహూకరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలకు, నాయకులకు సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జహంగీర్, నిజాం, మూసా, ఇమ్రాన్, అన్వర్, అర్షద్, ఫహీమ్, మున్నా, ఫైసల్, మగ్బూల్ పాల్గొన్నారు.



సిరిపురం యాదయ్యకు నివాళులర్పిస్తున్న బేర బాలకిషన్ తదితరులు

అమరువీరుడు యాదయ్య అందరికీ ఆదర్శం

కొత్తపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన యాదయ్య అందరికీ ఆదర్శమని రాష్ట్ర మాలల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్(బాలన్న) అన్నారు. సిరిపురం యాదయ్య జయంతి సందర్భంగా సోమవారం కొత్తపేట చౌరస్తాలో యాదయ్య విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. యాదయ్య వీఎంహోంలో చదువుకున్నారని, ఆయన జ్ఞాపకార్థం వీఎంహోంలో యాదయ్య కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి నాయకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సామాజిక న్యాయ సాధన సమితి అధ్యక్షులు ఆకుల అరవింద్ కుమార్, కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయ ట్రస్టు బోర్డు మాజీ సభ్యులు బబ్బూరి ఆనంద్‌కుమార్‌గౌడ్, తరంగా ఫౌండేషన్ చైర్మన్ సిల్వేరు వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడిని కలిసిన నేతలు

సరూర్‌నగర్ : నగర శివారు లో ఏర్పాటు చేసిన యువ క్రాంతి సంరక్షణ శిబిరంలో పాల్గొనడానికి సోమవారం నగరానికి విచ్చేసిన యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్య క్షుడు ఉదయభానును యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డితో కలిసి మీర్‌పేట్‌కు చెందిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సామిడి సాయిచరణ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నగరానికి వచ్చిన ఆయనకు బొకే అందజేసి స్వాగతం పలికారు. ఉదయభాను మాట్లాడుతూ తెలంగాణలో యూత్ కాంగ్రెస్ పటిష్టంగా ఉన్నదని, భవిష్యత్‌లో ఆ పట్టు చేజారకుండా చూసుకోవాలని సూచించారు.

పదో తరగతి పరీక్షలు టర్నింగ్ పాయింట్ : కలెక్టర్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు ప్రతి విద్యార్థి జీవితానికి టర్నింగ్ పాయింట్ అని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సికింద్రాబాద్‌లోని నల్లగుట్ట (ఓల్డ్) ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల పరిసరాలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... స్కూల్ ఆవరణలో చెత్తాచెదారం లేకుండా చూడాలని, పిల్లలకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలపై భయం వీడి మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. గత ప్రశ్నాపత్రాలను ప్రాక్టీస్ చేస్తే అవగాహన ఏర్పడుతోందన్నారు. సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ శ్రీధర్, డీఐఎస్‌లు గుండప్ప, స్వరూప, కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.